నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేస్ హాస్పిటల్, గురుమూర్తి లేన్, మోతీలాల్ నెహ్రూనగర్, ఎయిర్ కార్గో, శ్యాంలాల్ బిల్డింగ్స్, ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐసీఐసీఐ బ్యాంక్ లేన్, భగవంతాపూర్, గగన్‌విహార్ కాలనీ, షేర్‌ఖాన్ బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించండి సారూ..



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కంటోన్మెంట్: అంగన్‌వాడీ టీచర్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని వారు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నందున ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న వాటి అద్దెలు ఇతర బకాయిలు మంజూరు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న కమ్యూనిటి హాళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో గదులను అంగన్ వాడీలకు అప్పగించాలని కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అశోక్‌కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ అన్నారు. ఆదివారం ఆమె సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని అశోక్‌కాలనీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బందిని అడిగి సర్వే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందని, ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. అర్హులైన వారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందనక్కర్లేదన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అర్హులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

చిలకలగూడ: సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సికింద్రాబాద్ లైన్స్ భవన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులుగా పాలూరి సురేష్ , వెంకటేశ్వరరావు (బిల్డర్‌బాబు), కోశాధికారి గోవిందరాజులతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులను అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలబెట్టేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. సికింద్రాబాద్‌లోని ఆర్యవైశ్యులను సంఘటితం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. నూతన కమిటీ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు జగదీశ్వర్, సురేష్, శ్రీనివాసరావు, హరీష్, వెంకటేశ్వరరావు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ జేఏసీ నాయకుల ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ: హీరో అల్లు అర్జున్ అభిమానుల నుంచి తమకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఓయూ జేఏసీ నాయకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్జున్‌కు క్షమాపణ చెప్పాలని లేకపోతే దాడిచేస్తాం , చంపుతాం అని అల్లు ఆర్మీ, అల్లు అర్జున్ ఫ్యాన్స్ పేరుతో బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఓయూ జేఏసీ నాయకులు రెడ్డి. శ్రీను, నాగరాజు, బోనాల నరేష్, ప్రకాష్ తెలిపారు.

బస్‘బే’లు.. మళ్లీ తెరపైకి!

కొత్తగా 40 ఏర్పాటుకు నిర్ణయం
- నివేదిక కోరిన కన్వర్జెన్స్ కమిటీ
- జనవరిలోగా అందుబాటులోకి...
- ప్రతిపాదనలకు జీహెచ్‌ఎంసీ కసరత్తు

నగరంలో ట్రాఫిక్ సమస్యలను రూపుమాపడం, ప్రమాదాలను అరికట్టడం కోసం ఇదివరకు ప్రతిపాదించిన బస్ బేల ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు, కొత్త ఫుట్‌పాత్‌ల నిర్మాణం, డివైడర్ల ఏర్పాటుపై ఇదివరకటి సమావేశాల్లో దృష్టి సారించిన జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ నేతృత్వంలో ఏర్పాటైన కన్వర్జెన్స్ కమిటీ ప్రతినిధులు తాజాగా బస్‌బేల ఏర్పాటుపై దృష్టి సారించారు. జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో కలిపి కనీసం 40 బస్‌బేలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారుల అభిప్రాయాలు తీసుకుని జనవరి ఆఖరులోగా బస్‌బేలు ఏర్పాటు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. – సికింద్రాబాద్

సికింద్రాబాద్ జోన్ పరిధిలో ఐదేళ్ల క్రితం రూపొందించిన బస్‌బేల ఏర్పాటు ప్రతిపాదనలు మూలన పడ్డాయి. ప్రయాణికులు ఇబ్బందులు వెలుగు చూసినపుడు, ప్రమాదాల బారిన పడిన సందర్భాల్లో మాత్రమే సమీక్ష సమావేశాలు నిర్వహించడం, త్వరితగతిన బస్‌బేలు నిర్మించాలని తీర్మానించడం, ఆ తరువాత వాటిని విస్మరించడం రివాజుగా మారింది. అయితే వీటి ఏర్పాటుకు ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ అధికారులు సహకరించడం లేదని సాకులు చెబుతుండేవారు. ఫలితంగా ఐదేళ్లుగా అధునాతన బస్‌బేల నిర్మాణాలు ఆచరణకు నోచుకోలేదు.

ఐదేళ్ల క్రితం 50 ఏర్పాటు

బస్‌బేల నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం అధికారులు ఐదేళ్ల క్రితం ప్రతిపాదనలు రూపొందించారు. ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో వివిధ ప్రాంతాల్లో సర్వేలు కూడా నిర్వహించారు. అప్పట్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన 98 బస్‌బేలలో 49 మాత్రమే ఏర్పాటు చేయగలిగారు. స్థలం సరిపడా లేక కొన్ని, స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో మరికొన్ని... ఇలా పలు సాంకేతిక కారణాలతో మరో 49 బస్‌బేల నిర్మాణాలు సాధ్యం కావడం లేదని అధికారులు చేతులెత్తేశారు.

జనవరిలోగా ఏర్పాటు

సాంకేతిక సమస్యల కారణంగా మాత్రమే ప్రతిపాదిత బస్‌బేలు ఏర్పాటులో జాప్యం జరిగిందని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో ఇరుకైన రహదారులు ఉన్న నేపథ్యంలో బస్‌బేల ఏర్పాటు సాధ్యం కాలేదు. బస్‌బేల ప్రతిపాదిత రహదారులు అన్నింటిలో విస్తరణ పనులు పూర్తి అయ్యాయి. అన్ని ప్రాంతాల్లో బస్‌బేల ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో నెలకొని ఉన్న స్థల సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించే పనుల్లో నిర్దేశిత అధికారులు ఉన్నారు. రద్దీ ఉన్న ప్రాంతాలు గుర్తించే పనుల్లో ఆర్టీసీ, ట్రాఫిక్ అధికారులు ఉన్నారు. వారి నివేదిక అందగానే పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. జనవరి ఆఖరులోగా మొత్తంగా బస్ బేల ఏర్పాటు పనులు పూర్తి చేస్తామని జోనల్ మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.



నాలుగు బస్‌బే లు ఏర్పాటు చేయనున్న చిలకలగూడ కూడలి

తొలగించడంతో ఇబ్బందులు..

సికింద్రాబాద్‌లోని పలుచోట్ల బస్‌షెల్టర్లు లేవు. కొన్నింటిని రహదారుల విస్తరణలో భాగంగా తొలగించారు. మెట్రో పనుల కారణంగా మరికొన్నింటిని తీసేశారు. అధునాతన బస్‌బేల ఏర్పాటు పేరుతో మరికొన్ని చోట్ల ఉన్న షెల్టర్లు తొలగించారు. రహదారుల విస్తరణ పూర్తయిన రహదారుల్లో మెట్రో అధికారుల సహకారంతో కొన్ని మాత్రమే బస్‌బేలు అందుబాటులోకి వచ్చాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేయాల్సిన బస్‌బేల విషయంలో మాత్రం ఏళ్ల తరబడి జాప్యం జరిగింది.

ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

సికింద్రాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాలను ఆదివారం సీతాఫల్‌మండీ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, సీనియర్ నాయకురాలు ప్రేమ పావని పార్టీ జండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తున్న ఘనత సీపీఐకి దక్కుతుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటం మొదలు తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ తమ కార్యకర్తలు ఎందరో ప్రాణ త్యాగాలు చేశారన్నారు. తమ పార్టీ పోరాటాల ఫలితంగా ఎందరో పేదలకు భూములు దక్కాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పేదలకు అండగా నిలబడుతున్నామన్నారు.ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు గణేష్, సాయి ఉద్యమ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, నాయకులు జోగు రాములు, శ్రీహరి, యాదగిరి, రాజు, పద్మ, నాగమణి, రూప, వెంకటేష్, మహేష్, జెల్ల కొండలు, యాకయ్య, యాకోబు, హుస్సేన్ ,ఫంగ శీను, తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

లాలాపేట: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2025 కేలండర్‌ను ఆదివారం లాలాపేటలోని నఫీజ్ గార్డెన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, మెజిషియన్ సామల వేణు, మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఫౌండర్ ట్రస్టీ కుమారుడు రాఘవేందర్, మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్నూరు కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. మున్నూరు కాపు సంఘం ద్వారా ఏటా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లాలాపేట మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చిలుక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మీసాల శ్రీనివాస్, కోశాధికారి కొండమడుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

బీజేపీతోనే కంటోన్మెంట్ అభివృద్ధి



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: భారతీయ జనతాపార్టీతోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన సికింద్రాబాద్ కంటోన్మెంట్ నాలుగో వార్డు శివ అరుణ్ కాలనీ, అశ్వినీ నగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటోన్మెంట్ అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఏమీ లేదన్నారు. గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కంటోన్మెంట్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. రాష్ట్రంలో 119 నియోజక వర్గాలు ఉండగా అధికార కాంగ్రెస్ పార్టీ 118 నియోజక వర్గాలే ఉన్నట్లు భావిస్తూ కంటోన్మెంట్ అభివృద్ధిని గాలికొదిలేసిందని ఆరోపించారు. కంటోన్మెంట్‌లో జరిగే ప్రతి అభివృద్ధి పనిలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ పాత్ర ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బీజేపీ కన్వీనర్ విజయానంద్, సీనియర్ నాయకుడు టోపీ శంకర్, 4వ వార్డు బీజేపీ అధ్యక్షులు రాజ మల్లేష్, నాయకులు ప్రేమ్ కుమార్, బాబు రావు, హరి, ప్రభాకర్, జగన్, మహేష్, డెనిస్, సాయి కృష్ణ, నవీన్ కుమార్, రాకేష్, రామకృష్ణ, దీన్ దయాళ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

దూర విద్యతో అద్భుతాలను సృష్టించొచ్చు..



వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

సనత్‌నగర్: విద్యార్థినులు దూర విద్యతో అద్భుతాలను సృష్టించవచ్చునని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో యూనివర్సిటీ విద్యార్థి అభ్యసనా సేవా కేంద్రం నూతన డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు ఆదివారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు యూనివర్సిటీ అందిస్తున్న బోధనా సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతంగా ముందుకు సాగాలన్నారు. నిరంతర కృషితో విద్యా రంగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. దూర విద్యతో అద్భుతాలను సృష్టించవచ్చన్నారు. విద్యార్థి అభ్యసనా సేవా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంకితభావం, పట్టుదలతో చదివి దూర విద్యతో కూడా అత్యున్నత ఉద్యోగాలను సాధించిన వారు ఎందరో ఉన్నారన్నారు. అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రచురించిన డిగ్రీ, పీజీ కోర్సుల పుస్తకాలు పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలుగా వేస్తున్నాయన్నారు. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్న విశ్వవిద్యాలయంగా అంబేడ్కర్ యూనివర్సిటీకి గుర్తింపు పొందిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రాంతీయ అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్ మారోజు రామాచారి మాట్లాడుతూ తమ అధ్యయన కేంద్రాన్ని పీజీ సెంటర్‌గా మార్చాలని యూనివర్సిటీ అధికారులను కోరారు. మహిళల కోసం ప్రత్యేకంగా పీజీ స్టడీ సెంటర్‌ను ఏర్పాటుచేసే విషయాన్ని ప్రత్యేకంగా అధికారులు పరిగణలోనికి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నరసింహులు, డాక్టర్ వీరయ్య, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, ప్రమోద్‌కుమార్, రవికుమార్, షరీఫ్, పుష్పలీల, మంజులాగౌర్, సురేఖ, రత్నప్రభ, గోపాల్, కుమారి, శ్రీనివాస్, విజయ్‌కుమార్, అశోక్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ విభాగం విద్యార్థి శీలం. నాగేశ్వర్ రావు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అచలపతి పర్యవేక్షణలో ‘సోషల్ సెక్యూరిటీ ఫర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్–ఎ స్టడీ ఆఫ్ సెలెక్ట్ డిస్ట్రిక్ట్స్ ఇన్ తెలంగాణ’ అనే అంశం పై పరిశోధన చేసినట్లు తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన నాగేశ్వర్ రావు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. తన పరిశోధనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న రిసోర్స్ పర్సన్లు

కంటోన్మెంట్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లకు త్వరలోనే రెగ్యులర్ జీతభత్యాలు అందుతాయని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. రిసోర్స్ పర్సన్ల సమస్యలపై ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని రిసోర్స్ పర్సన్లు పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్లను రెగ్యులరైజ్ చేయాలని, జీవో నెం 60 ప్రకారం జీత భత్యాలు ఇప్పించాలని, రూ.10 లక్షల బీమా కల్పించాలని సీఎంను కోరామన్నారు. ఆయా సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 43, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 17, క్యారెట్ 25, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 37, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6.

దళిత ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం



అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేస్తున్న శంకర్

అడ్డగుట్ట: దళిత ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం తుకారాంగేట్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వారం వారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న రాములు పాఠాలు బోధిస్తున్న సమయంలో 9వ తరగతి చదువుతున్న అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థికి కాలు తగిలింది. దీంతో అయ్యప్ప స్వాములు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిపై దాడి చేయడమే గాక విద్యార్థి కాళ్లు మొక్కించడం అమానుషమన్నారు. పథకం ప్రకారం ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పులి కల్పన, ఉమక్క, ఐశ్వర్య, భవానీ, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

ఘనంగా పద్మశాలి సంఘం స్వర్ణోత్సవ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు

చిలకలగూడ: సీతాఫల్‌మండీ డివిజన్, మధురానగర్ కమ్యూనిటీ హాల్‌లో పార్శిగుట్ట సంజీవపురం పద్మశాలి సంఘం స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వర్ణోత్సవ కమిటీ చైర్మన్ చిక్కా దేవదాసు నేతృత్వంలో జరిగిన వేడుకల్లో పలువురు పద్మశాలి సంఘ నాయకులు పాల్గొని మాట్లాడారు. పద్మశాలీలు సంఘటితమై రాజకీయ రిజర్వేషన్లు, హక్కులు సాధించుకోవాలన్నారు. పద్మశాలీల అభ్యున్నతికి కలిసికట్టుగా పోరాడాలన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షకార్యదర్శులు హనుమాన్ల బాలరాజు, తాటికొండ చంద్రశేఖర్, కోశాధికారి చక్రధారి, అఖిల భారత పద్మశాలి సంఘ అధ్యక్షుడు కందగట్ల స్వామి, పద్మశాలి సేవసమాజం అధ్యక్షుడు నోముల ప్రసాద్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సుదర్శన్‌రావు, ప్రతినిధులు సత్యనారాయణ, వనమాల శ్రీనివాస్, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవాలి

కంటోన్మెంట్: కాంగ్రెస్‌కు పార్టీకి పూర్వవైభవం తేవాల్సిన బాధ్యత పార్టీ నేతలు, కార్యకర్తలపై ఉందని కాంగ్రెస్ సేవాదల్ జాతీయ సెక్రెటరీ, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్ రెడ్డి (కేజేఆర్) అన్నారు. ఆదివారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ కేజేఆర్ గార్డెన్స్ ఆవరణలో జనార్దన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి సీనియర్ నేతలు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కేజేఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తనలాంటి సీనియర్ నేతలకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరహాలోనే రేవంత్ రెడ్డి పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చాడన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కనుకుల పద్మారెడ్డి, యోగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



నియామక పత్రాన్ని అందజేస్తున్న సత్యానగర్ సంక్షేమ సంఘం నాయకులు

లాలాపేట: లాలాపేట సత్యానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రాజు గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన సత్యానగర్ సంక్షేమ సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియపారు. సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు కాలనీ సంక్షేమానికి పాటుపడతామన్నారు. సమావేశంలో నాయకులు క్రిష్ణ,నాగేందర్, శంకర్‌రావు, సూర్యకిరణ్, నర్సింహ, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ద్వారానే స్త్రీలకు హక్కులు



అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేసిన డీబీఎఫ్ ప్రతినిధులు

సికింద్రాబాద్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అందించిన భారత రాజ్యాంగం ద్వారానే స్త్రీలకు సమానత్వ హక్కులు వచ్చాయని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. ఆదివారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి కూడలిలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ తరతరాలుగా స్త్రీల పట్ల వివక్ష కనబరుచడంతోపాటుగా విద్య, ఉద్యోగ, సంపద తదితర రంగాల్లో హక్కులు నిరాకరించారన్నారు. రాజ్యాంగం సమానత్వ హక్కులను కల్పించడం వల్లే నేడు అన్ని రంగాల్లో స్త్రీలు ముందడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన గృహ కార్మిక సంఘం నగర నాయకులు చీకొటి సుజాత, శశికళ, కవిత, పరమేశ్వరి, రమ, స్వాతి, శాంతమ్మ, వెంకటమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి..

- మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉట్టిపడిన తెలుగు సంప్రదాయం
- నగరంలో గ్రామీణ సంస్కృతి...

సనత్‌నగర్: గంగిరెద్దుల విన్యాసాలు...రంగురంగుల హరివిల్లులు..హరిదాసుల కీర్తనలు..కోడి పందేలు. అచ్చతెలుగు ఆటపాటలతో మోడల్ కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో సంక్రాంతి సందడి నెలకొంది. ఆదివారం. కొత్తపల్లి మధుసూదన్‌రావు, దండా బుచ్చిబాబు, మైనేని ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబురాలు అంబురాన్నంటాయి. పెద్ద సంఖ్యలో కుటుంబాలు హాజరై ముందస్తుగా సంక్రాంతి పండుగ అనుభూతులను సొంతం చేసుకున్నారు. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. వీరమాచినేని రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో అడుసుమిల్లి శ్రీనివాసరావు, అప్పసాని రాజేష్, ముప్పా అంకమ్మచౌదరి, ఇనుగంటి లావణ్య, మాచారావు, టిల్లు భాయ్, జేఎస్‌టీ శాయి పాల్గొన్నారు.







గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టిన సంక్రాంతి సంబురాలు..